



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల

పైరుకు తెగుళ్లు.. రైతుకు దిగులు..



పప్పు శనగ పైరుకు నీళ్లు మందులు స్ప్రే చేస్తున్న రైతు

కుళ్లిపోతున్న పప్పు శనగ పంట

మేఘాలు కమ్ముకుంటుండడంతో అధికమవుతున్న పురుగు బెడద

పప్పుశనగ రైతుకు ఈ ఏడాది కూడా కష్టకాలం వచ్చింది. ఓవైపు వర్షాభావం.. మరోవైపు తెగుళ్ల బెడద.. ప్రస్తుతం పప్పు సెనగ పైరును విపరీతమైన తెగుళ్లు వెంటాడుతున్నాయి. వీటికి ఎన్ని రకాల మందులు పిచికారి చేస్తున్నా అదుపు కావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు...

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈ ఏడాది మండలంలో మొదటి నుంచి కూడా ఎక్కువగా వర్షాలు పడ్డాయి. అయితే పప్పుశనగ పైరు విత్తిన తర్వాత కూడా అధిక వర్షాలు రావడంతో పొలాలలో నీరు ఆగిన చోట అంతా కూడా పైరు కుళ్ళిపోయింది. విత్తనం వేస్తే కూడా సరిగా పంట రాదని రైతులు అలాగే విడిచి పెడుతున్నారు. చిన్న పైరుకే లద్దె పురుగు, ఎర్ర తెగుళ్లు, పచ్చపురుగు సోకి కొమ్మకొమ్మలుగా కనబడుతున్నాయని చెబుతున్నారు. పైరు కింద వేరు నల్లగా మారి పైరు ఎండినట్లు కనపడుతోంది. మండలంలో 45 వేల ఎకరాల సాగు భూమి ఉంది. అందులో ప్రధానంగా ఉన్నదే నల్ల రేగిడి పొలం. అందులో పప్పుశనగ ఎక్కువగా సాగు చేస్తారు. నేమకల్లు, బెల్డోన, తిమ్మాపురం, నగర డోనా, కుందనగుర్తి, దౌల్తాపురం, గుమ్మనూరు, కాజీ పురం ఈ గ్రామాలలో 25 వేల ఎకరాలలో 80 శాతం పప్పుశనగ పైరునే సాగు చేస్తున్నారు. పప్పుశనగకు ధర బాగా ఉండటంతో ఈ సరైన దిగుబడి అధికంగా రావాలని ఉద్దేశంతో పైరును అశ్రద్ధ చేయకుండా బాగా చూసుకోవాలని తెగుళ్ల సోకుతున్న అప్పు చేసి మరి వారానికి ఒకసారి నీళ్ల మందులు స్ప్రే చేస్తున్నామని రైతులు తెలిపారు. ఇంత చేస్తున్న పెట్టుబడులు పోయి రైతన్నకు ఏమి మిగులుతుందో అని ఆశగా ఎదురు చూస్తున్నామని రైతులు వాపోతున్నారు. రైతులకు వ్యవసాయ అధికారులు కూడా గ్రామాల్లోకి వచ్చి వివిధ పంటలపై సూచనలు ద్వారా అవగాహన కల్పిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



కుళ్లిపోయిన పప్పు శగన పంట

పెట్టిన పెట్టుబడులు వస్తే మంచిది



నేను రెండు ఎకరాలలో పప్పుశనగ పైరు సాగు చేశాను. విత్తనం వేసిన తర్వాత అధిక వర్షం రావడంతో నీరు నిల్వ ఉన్న దగ్గర అర్ధ ఎకరా వరకు కూలిపోయింది. ఉన్న పైరును బాగు చూసు కుందామంటే విపరీతమైన తెగుళ్ల సోకుతున్నాయి. తెగుళ్లను నివారించడానికి వారానికి ఒకసారి నీళ్ల మందులు స్ప్రే చేస్తున్నాం. పంట ఏ మేరకు వస్తుందో, పెట్టిన పెట్టుబడులు తీరుతాయో లేదోనని దిగాలు చెందుతున్నాం.

- వెంకటేశ్వర్లు, రైతు.

రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

- శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మహిళా రక్షణచట్టాలను పటిష్టంగా అమలు చేయాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ లా విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గురువారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐదు రోడ్ల కూడలిలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్ అధ్యక్షత వహించారు. సందర్భంగా శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పి.నిర్మల, జిల్లా నాయకులు సుజాత, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు అబ్బుల్లా, నగేష్, ఎస్ఎఫ్ఐ నగర నాయకులు అబ్బు, భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకీ మహిళలపై, విద్యార్థినులపై దాడులు, అత్యాచారాలు పెరిగి పోతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్తున్నా ఆచరణలో ఏమాత్రం లేదన్నారు. మహిళలు, విద్యార్థులపై అత్యాచారాలు దాడులు జరగడానికి ముఖ్య కారణం మత్తు పదార్థాలు, మద్యం అని, రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులను ఎక్కడికక్కడ పెట్టుకోవడానికి పర్మిషన్ ఇవ్వడం ద్వారా తాగేవారికి హద్దు లేకుండా తాగిన మైకంలో అత్యాచారాలు దాడులు చేస్తున్నారని తెలిపారు. ఎక్కడా లేనంత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో డ్రగ్స్ చాలా ఎక్కువగా ఎగుమతి అవడం జరుగుతోందన్నారు. రాష్ట్ర హోం మంత్రి ఒక మహిళ అయినా రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదన్నారు. విశాఖ లా విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మహిళలకు, విద్యార్థినీలకు రక్షణ కల్పించాలని కోరారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను కలుపుకొని తగిన బుద్ధి చెప్పవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సూరి, న్యూ సిటీ నగర అధ్యక్షులు గౌతం, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 21 కేసుల్లో 13 మంది అరెస్టు

- 478.07 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.8.04 లక్షలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లాతో పాటు వివిధ జిల్లాలలో, రాష్ట్రాల్లో తరచుగా దొంగతనాలకు పాల్పడుతున్న 13 మంది నిందితులను అరెస్టు చేశామని కర్నూలు జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూఆరు నెలల నుండి జిల్లాలో చోటు చేసుకున్న ప్రాపర్టీ దొంగతనాల కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న ప్రాపర్టీని వేగంగా రికవరీ చేయాలని గత నెల 5న ఆదోని సబ్ డివిజన్ పరిధి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించామన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆదోని డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో ఆదోని ఒకటో పోలీస్ స్టేషన్ సిఐ శ్రీరామ్, ఎస్ఐ రామస్వామి, పోలీస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడ్డారన్నారు. ఈ మేరకు ఆదోని టౌన్ కర్నూలు జిల్లా నంద్యాల జిల్లా నెల్లూరు జిల్లా చుట్టుపక్కల జిల్లాల్లో 10 రోజులపాటు నిఘా ఉంచారన్నారు. అంతరాష్ట్ర ముఠాకు సంబంధించిన రెండు ముఠాలను ఆదోని టౌన్‌లోని తిమ్మారెడ్డి బస్టాండు, ఆత్మకూరు టౌన్‌లోని సిద్దాపురము వద్ద ఉన్న అడవులలో వేరువేరుగా పట్టుకున్నారన్నారు. విచారించి దొంగలించిన సొత్తును స్వాధీనంలోకి తీసుకున్నామన్నారు. ఇదివరకే రూ. 24 లక్షల విలువ గల బైక్ లను ఇది వరకే రికవరీ చేశారన్నారు. గురువారం రూ.41 లక్షల ప్రాపర్టీ రికవరీ చేశారన్నారు. ఈ దొంగలముఠా దేశంలో అన్నిచోట్ల తిరుగుచూ ముఖ్యంగా కర్నూలు జిల్లాలో పలు ప్రాంతాలలో దొంగతనాలు చేశారన్నారు. ఇవే కాకుండా రద్దీగా ఉండే తిరునాళ్లు, బహిరంగ సభలు జాతరలు, పాదయాత్రలు, దేవుని ఊరేగింపులు, ఉత్సవాలు, ఎక్కువ జనాభా గూమి గూడే ప్రదేశాలలో బ్యాగ్ లిఫ్టింగ్, పిక్ ప్యాకెటింగ్, అటెన్సన్ డైవర్షన్ దొంగతనాలకు పాల్పడతారన్నారు. కర్నూలు జిల్లాలో మాత్రమే కాకుండా రాష్ట్రం పలు ప్రాంతాలలో ముఖ్య నగరాలలో, దేశంలోని పలు రాష్ట్రాలలో పెద్ద పుణ్య క్షేత్రాలకు వెళ్ళి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గతంలో కూడా వీరిపై పలు కేసులు నమోదు అయ్యాయి. వీరందరిని రిమాండుకు తరలించారు. ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అరెస్టు చేసిన వారి నుంచి రూ.33,07,800 విలువ గల 478.7 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.8,04,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రాపర్టీ రికవరీలో బాగా పనిచేసిన ఆదోని ఒకటవ పట్టణ పోలీసులకు జిల్లా ఎస్పీ రివార్డులు అందజేశారు. సమావేశంలో ఆదోని డిఎస్పీ సోమన్న , ఆదోని ఒకటవ పట్టణ సిఐ శ్రీరామ్, సిఐలు ప్రసాద్, కేశవరెడ్డి, అబ్దుల్ గౌస్, మన్సురుద్దీన్, శివశంకర్, ఆదోని ఒకటవ పట్టణ ఎస్సై రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పి బిందు మాధవ్

పారిశ్రామిక ప్రోత్సాహకాలు

రూ.3.48 కోట్లు విడుదలకు ఆమోదం

- ఇండస్ట్రియల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పారిశ్రామిక ప్రోత్సాహకాలు 39 క్లెయిమ్స్‌కు సంబంధించి రూ.3 కోట్ల 48 లక్షల 71 వేల 941లు నిధుల విడుదలకు ఆమోదం తెలిపినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష వెల్లడించారు. గురువారం కర్నూలు కలెక్టరేట్‌లో ఇండస్ట్రీయల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పెట్టుబడి రాయితీ కింద 33 క్లెయిమ్స్‌కు రూ. 2 కోట్ల 85 లక్షల 80 వేల 357, విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్ కింద 1 క్లెయిమ్స్‌కి రూ.1 లక్ష 50 వేల 222, వడ్డీ రాయితీ రీయింబర్స్‌మెంట్ కింద 3 క్లెయిమ్స్‌కి రూ.10 లక్షల 19 వేల 167, సేల్స్ టాక్స్ రీయింబర్స్‌మెంట్ కింద 2 క్లెయిమ్స్‌కి రూ.51 లక్షల 22 వేల 195లు పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఆమోదం తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్లు పారిశ్రామిక వాడలోని జయరాజ్ స్టీల్ ప్లాంట్ పరిశ్రమలో బ్లాస్టింగ్ వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే దీనిపై దృష్టి సారించాలని పరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వేకి సంబంధించి ఈ నెల 27న స్పెషల్ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు, ఎంపిడిఓలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ఇన్‌ఛార్జి జిఎం అరుణ, ఎపిఐఐసి జిఎం శ్రీనివాసరెడ్డి, ఐలా ఛైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్, కాలుష్య నియంత్రణ అధికారి, మత్స్యశాఖ అధికారి శ్యామల, ఏపిఎంఐపి పిడి ఉమాదేవి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

26న ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర ప్రభుత్వ విధానాలపై శంఖారావాన్ని పూరించాలని, 26న జరిగే ర్యాలీ, కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. గురువారం కర్నూలు నగరంలోని సిఐటియు న్యూ సిటీ ఆల్ ట్రేడ్ యూనియన్ విస్తృత స్థాయి సమావేశం నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, జిల్లా నాయకులు పి.నిర్మల, నగర కార్యదర్శి సి.హెచ్.సాయి బాబా, నగర నాయకులు టి.రాముడు మాట్లాడుతూ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన బిజెపి తన దూకుడును ఆపకుండా కార్మిక కర్షక రైతు వ్యతిరేక విధానాలనే అవలంబిస్తూ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నదన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం, జనసేన కూటమి కేంద్ర ప్రభుత్వ విధానాలనే రాష్ట్రంలో అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని కార్మిక, కర్షక రైతు సంఘాల ఆధ్వర్యంలో 26న నిరసన కార్యక్రమాలుచేపట్టాలని సిఐటియు, అఖిలపక్ష కార్మిక సంయుక్త కిసాన్ మోర్చా సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నాయన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన రూ.26 వేల కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించడం లేదన్నారు. 26న ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ నుండి ర్యాలీగా బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున కార్మిక, కర్షక పోరాటం జరగబోతోందని, ఈ పోరాటంలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నగర నాయకులు కె.సుధాకరప్ప, జి.ఏసు, ఎస్ఎండి రఫీ, కె.ప్రభాకర్, హమాలీ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎం.మల్లికార్జున, విష్ణుమూర్తి, రామచంద్రుడు, కోటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

వలసల నివారణకు చర్యలు : పీడీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధి కూలీల వలసల నివారణకు చర్యలు తీసుకుంటామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వెంకట రమణయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఛాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఉపాధి పనుల కల్పనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టం కింద పనులు మరింత వేగవంతంగా జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. కలెక్టర్ పి.రంజిత్ బాషను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఉపాధి హామీ ఉద్యోగుల జెఎసి నేతలు ఆయనను కలిసి అభినందించారు.



పీడీ వెంకటరమణయ్యను అభినందిస్తున్న ఉద్యోగులు

'సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి'

ప్రజాశక్తి - పత్తికొండ


పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.రంగస్వామి కోరారు. గురువారం ఏపీ రాజధాని అమరావతిలో శాసనసభ సచివాలయంలో న్యాయశాఖ కార్యదర్శి వి.సునీతను ఎమ్మెల్యే, న్యాయవాదులు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... జిల్లాలో వెనుకబడిన పత్తికొండ పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు దాదాపు 40 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆదోనికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ప్రస్తుతం పత్తికొండ రెవెన్యూ డివిజన్ అవడంతో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు అవకాశం ఉందని వివరించారు.బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, టిడిపి రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, తిమ్మయ్య చౌదరి, న్యాయవాదులు బాలబాష, సుధాకృష్ణ, రాజశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

26న ధర్నాను జయప్రదం చేయండి

- రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రైతు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. గురువారం ఓర్వకల్ ప్రజా సంఘాల కార్యాలయంలో అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షత వహించారు. రామకృష్ణ, రైతుసంఘం మండల కార్యదర్శి పి.సుధాకర్, మండల అధ్యక్షులు ఎస్.మధుసూదన్, సిఐటియు మండల నాయకులు వి.సుధాకర్, మాసుం బాష మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి పాత పద్ధతులను కొనసాగిస్తోందని, రైతులు, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతన చట్టం ప్రకారం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను ఆపాలని, రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని కోరారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి, 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- జెసి డాక్టర్ నవ్య

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని జెసి డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెసి, జిల్లా మత్స్య శాఖ అధికారి శ్యామల, మత్స్యకార సొసైటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ... ఈ కార్యక్రమం ద్వారా మత్స్యకారులకు కెనరా బ్యాంకు వారి సహకారంతో కిసాన్ క్రెడిట్ లోన్ల రూపంలో 48 మంది మత్స్యకార కో-ఆపరేటివ్ సభ్యులకు రూ.12.85 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. ఈ రుణాల ద్వారా మత్స్యకారులు ఎవ్వరీ మీద ఆధారపడకుండా వారి జీవనోపాధికి ఉపయోగపడుతుందన్నారు. మిగతా బ్యాంకులు కూడా మత్స్యకార సంఘాలకు రుణాలు అందజేసేందుకు ముందుకు రావాలని కోరారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం మంచి మార్కెటింగ్ సేవలు కూడా అందజేయడం ద్వారా మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. మహిళలు కూడా కోఆపరేటివ్ సంఘాలుగా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ లాభాలను వచ్చే అవకాశం ఉంటుందని, అందుకు కలెక్టర్ కూడా బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. నాబార్డు వారు కూడా రుణాలు ఇవ్వడానికి ముందుకొచ్చారని, అవసరం ఉన్న వారికి రుణాలు అందజేసేలా ఒక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కలెక్టర్ మత్స్య శాఖ అధికారిని ఆదేశించారని చెప్పారు. జిల్లాలో ఉన్న మత్స్యకారులు ఎగుమతి మీద దృష్టి పెట్టి మరింత అభివృద్ధి పొందే అవకాశం ఉంటుందని, మత్స్య సంఘాల కూడా కృషి చేయాలన్నారు. మత్స్యకార సొసైటీ సభ్యులు, రైతులు జెసికి శాలువా, పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో ఉత్తమ మహిళా కో-ఆపరేటివ్ సభ్యులుగా రాణిస్తున్న బెస్త సునీతమ్మ, ఉత్తమ మార్కెటింగ్ చేస్తున్న కౌసల్యను జెసి, మత్స్య శాఖ అధికారి చేతుల మీదుగా మెమొంటో, శాలువాతో సన్మానించారు. కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, డిసిఓ రామాంజనేయులు, సహాయ సంచాలకులు సంధ్యారాణి, జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

గుండ్రేవుల ప్రతిపాదిత ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లా ప్రజల చిరకాల కోరిక గుండ్రేవుల ప్రాజెక్టు కదలిక మొదలయింది. గురువారం నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ కబీర్ బాషా, ఎస్ఈ బాలచంద్ర రెడ్డి, ఈఈ ప్రతాప్, ఉన్నతాధికారులు గుండ్రేవుల ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలంగా ఉండటంతో పరిశీలించినట్లు సమాచారం. వచ్చే వారం ముఖ్యమంత్రి జిల్లా పర్యటనలో భాగంగా గుండ్రేవులను సందర్శించే అవకాశం ఉందని జిల్లా నీటిపారుదల ఉన్నతాధికారులు గుండ్రేవుల ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు.

బీడి కార్మికులకు ఒరిజినల్ పట్టాలివ్వాలి

- ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

బీడి కార్మికులకు ఒరిజినల్ పట్టాలివ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి షరీఫ్ డిమాండ్ చేశారు. కర్నూల్ నగరంలోని జొహరాపురం పరిధిలో గల 19వ వార్డు బీడి కార్మికుల ఇళ్లకు ఒరిజినల్ పట్టాలు ఇవ్వాలని సమావేశం అబ్దుల్ దేశాయి అధ్యక్షతన నిర్వహించారు. ఇక్బాల్ హుస్సేన్, షరీఫ్ మాట్లాడుతూ బీడి కార్మికుల స్థలాలలో ఇతర వ్యక్తులు చొరబడి కబ్జాలు చేస్తునఆనరని, వారి నుండి స్థలాల రక్షణ కోసం రెవెన్యూ అధికారులు, పోలీసులు సహకరించాలని కోరారు. ఈ కబ్జాకోరుల నుంచి స్థలాలను కాపాడుకోవడం కోసం వారి ఒరిజినల్ పట్టా వారికి ఇస్తే సమస్య ఉండదని తెలిపారు. కాలనీవాసులు మహ్మద్, ఎమ్‌డి.ఫరూక్, అహ్మద్, హనీఫ్, మహ్మద్ షమీ, హఫీజ్, సయీద్ బాషా, గఫూర్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

టిడిపి ఎస్సీ సెల్ నగర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్‌కు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ శ్రీనివాసులను సన్మానించారు. ఎస్సీ సెల్ నాయకులు కె.గిడ్డన్న మాట్లాడుతూ... జిల్లా సీనియర్ దళిత నాయకులకు నామినేటెడ్ పదవుల్లో తగిన గుర్తింపునిచ్చి ఇద్దరిని ఎంపిక చేయడం పట్ల జిల్లా దళిత నాయకుల కృషికి దక్కిన ఫలితం అని కొనియాడారు. మంత్రి టిజి.భరత్ సహకారంతో సాధ్యమైందని అన్నారు. ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పోతురాజు శివ, పెంచలయ్య, కర్ణ, ఈశ్వర్, అనంతయ్య, దినేష్, మాధవ, రాజ్, దేవా పాల్గొన్నారు.

ఎర్రమట్టి అక్రమ రవాణా - ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని ముక్కల గట్టులో అక్రమంగా ఎర్రమట్టి రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్ఐ తిమ్మారెడ్డి గురువారం పట్టుకున్నారు. ఇసుక, ఎర్రమట్టి, గనులను కాపాడుకోవడం మన బాధ్యత అని, అక్రమ రవాణా నేరమని, చర్యలు తప్పవని హెచ్చరించారు.

రూ.1.30 కోట్లతో అభివృద్ధి పనులు

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ మండలం పుచ్చకాయల మాడ గ్రామంలో రూ.1.30 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. మాజీ డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమానికి పుచ్చకాయల మాడ గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేశారని అన్నారు. తమ గ్రామానికి రూ.1.30 కోట్లు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేశారని అన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, హై స్కూల్ ప్రహరీ, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి, బడుగు బలహీన వర్గాల కోసం కమ్యూనిటీ హాల్ ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. బోయ కాశీనాథ్ కుటుంబానికి జీవనోపాధి కింద చిన్న కుమారుడికి ఆటో కూడా మంజూరు చేశారని అన్నారు.



ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వెల్దుర్తి

పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ సహకారంతో వెల్దుర్తిలోని 10వ వార్డు పాత నీళ్ల ట్యాంకు దగ్గర నుంచి పోలీస్ స్టేషన్ సర్కిల్ వరకు సుమారు రూ.24 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను టిడిపి మండల అధ్యక్షులు బలరాం గౌడ్, యువ నాయకులు రమాకాంత్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే సహకారంతో మండలాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తామని తెలిపారు. టిడిపి నాయకులు రాఘవేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

మండలి ప్యానల్ స్పీకర్‌గా బిటి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

టిడిపి శాసనమండలి ఉప నాయకులు బిటి.నాయుడు మండలి సమావేశం సందర్భంగా గురువారం శాసనమండలిలో ప్యానల్ స్పీకర్‌గా వ్యవహరించారు. తనకు అవకాశం కల్పించిన టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

హైకోర్టు బెంచ్ చారిత్రాత్మక నిర్ణయం

- కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయమని కురుబ/కురువ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు కె.రామకృష్ణ, వెంకటరాముడు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు కర్నూలు ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి యువ నాయకులు సూర్య ప్రకాష్, సుధాకర్, సాంబశివుడు, మహేష్ పాల్గొన్నారు. అలాగే టిడిపి జిల్లా కార్యాలయంలో టిడిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు కెఇ.జగదీష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. న్యాయవాదులు ఆకెపోగు ప్రభాకర్, దాసెట్టి శ్రీనివాసులు, చంద్రశేఖర్, శ్రీనివాస్ భట్, ఎల్‌వి.ప్రసాద్, గణేష్ సింగ్, బి.క్రిష్ణమూర్తి, మాదన్న, రవి గువేర, మోహన్ రెడ్డి, త్రివిక్రమ్, శాంతకుమార్, బి.మురళీమోహన్, గోవిందరాజులు పాల్గొన్నారు. **తుగ్గలి**లో టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు మాట్లాడారు. త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్ పూర్తి అవుతుందని తెలిపారు. **కర్నూలు (కార్పొరేషన్)**లో ఐలు జిల్లా అధ్యక్షులు సింగరాజు లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. **కర్నూలు (హాస్పిటల్)**లోని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి స్వగృహంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి టిడిపి నాయకులు, న్యాయవాదులు పాలాభిషేకం చేశారు. టిడిపి నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, వార్డు ఇన్‌ఛార్జీ పల్లె రఘునాథ రెడ్డి, టిడిపి నాయకులు వీరేంద్ర కుమార్, శ్రీకాంత్, న్యాయవాదులు జగదీష్, అయ్యస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి లీగల్ సెల్ నాయకులు

చలో కలెక్టరేట్‌కు తరలిరండి : సిఐటియు

ప్రజాశక్తి - వెల్దుర్తి

కర్నూలు కలెక్టరేట్ వద్ద 26న నిర్వహించే ధర్నాలో ప్రజలందరూ పాల్గొనాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు కోరారు. గురువారం వెల్దుర్తిలోని మోటార్ వర్కర్స్ కార్యాలయంలో సిఐటియు మండల అధ్యక్షుడు రాజు అధ్యక్షతన కార్మికుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వాన్ని మేల్కొల్పే విధంగా పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. మోటారు వర్కర్స్ సీనియర్ నాయకులు రాముడు, శ్రీనివాసులు, బజారు, హమాలీ వర్కర్స్ యూనియన్ చిన్న ఏసు, వెంకట్రాముడు పాల్గొన్నారు.

'రేషన్'ను సక్రమంగా పంపిణీ చేయాలి

- తహశీల్దార్ శివ రాముడు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్



మాట్లాడుతున్న తహశీల్దార్ శివరాముడు

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహశీల్దార్ శివ రాముడు తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ భవన్‌లో రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లకు సివిల్ సప్లయిస్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని రేషన్ డీలర్లు, ఎండియు ఆపరేటర్లు ప్రభుత్వ నియమాలు పాటిస్తూ రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన చలానాలు సకాలంలో చెల్లించాలని తెలిపారు.

నీటి పన్ను జాబితా సిద్ధం చేయండి

నీటి పన్ను జాబితా సిద్ధం చేయాలని తహశీల్దార్ శివ రాముడు పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో నీటి పన్ను జాబితా, అపార్‌పై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, యడవలి, బలాదూర్, చిన్నహరివాణం, చిన్నగోనెహళ్, మదిరే, బసాపురం, ఇస్వీ, ధణాపురం, నాగనాథనహల్లి గ్రామాలకు సంబంధించి నీటి పన్ను జాబితాను సిద్ధం చేసి రైతుల నుంచి వసూలు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అపార్‌ను పాఠశాల విద్యార్థులకు అమలు చేసేందుకు ప్రధానోపాధ్యాయులతో కలిసి సహకరించాలని ఆదేశించారు.

నీటి పన్ను వసూలుకు చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి - మంత్రాలయం



మాట్లాడుతున్న తహశీల్దార్ రవి

మండలంలోని రైతులు బకాయి ఉన్న సాగునీటి పన్నులు చెల్లించే విధంగా విఆర్‌ఒలు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఎస్.రవి ఆదేశించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న నీటిపారుదల, మేజర్ ప్రాజెక్టుల కింద సాగు చేసే రైతులు 2022 వరకు ఉన్న బకాయిలు చెల్లించి సాగు నీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. గ్రామసభల ద్వారా వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రెవెన్యూ శాఖకు అర్జీలను తమ పరిధిలో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు, సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి, ఆర్‌ఐ ఆదాం, విఆర్‌ఒలు భీమనగౌడ్, భీమయ్య, ఆనందం, నరసప్ప, శ్వేత పాల్గొన్నారు.

పిల్లలు ఉన్నప్పుడు జాగ్రత్తలు అవసరం

- సిడిపిఒ మద్దమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి



రికార్డులను పరిశీలిస్తున్న సిడిపిఒ మద్దమ్మ

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలున్న సమయంలో టీచరు, ఆయా జాగ్రత్తగా ఉండాలని ఆలూరు సిడిపిఒ మద్దమ్మ సూచించారు. గురువారం సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో రామదుర్గం, నగరడోనా, తిమ్మాపురం, నేమకల్లు, సంగాల గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేమకల్లు-3 కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాలను, కేంద్రాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచిన తర్వాతనే పిల్లలను తీసుకొచ్చి కేంద్రాల్లో వదలాలని తెలిపారు. వంట చేసే దగ్గరకు, గ్యాస్ సిలిండర్ దగ్గరకు పిల్లలు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే టేక్ హోమ్ రేషన్‌ను కూడా పారదర్శకంగా గర్భిణులకు, బాలింతలకు అందించాలని తెలిపారు. టీచరు బాల రంగమ్మ, ఆయా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆదోని అభివృద్ధికి సహకరించాలి

- కుడా ఛైర్మన్‌కు టిడిపి యువ నాయకుడు సిద్ధార్థ నాయుడు వినతి

ప్రజాశక్తి - ఆదోని



కుడా ఛైర్మన్‌ను కలిసిన సిద్ధార్థ నాయుడు

ఆదోని శివారు ప్రాంతాల అభివృద్ధికి చేయూతనివ్వాలని టిడిపి యువ నాయకులు సిద్ధార్థ నాయుడు కోరారు. గురువారం కర్నూలు నగరంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రాంతంలోని ఆదోని అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇప్పుడిప్పుడే ఆదోని శివారు ప్రాంతాల్లో నివాసాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. పట్టణవాసులు కూడా శివారు ప్రాంతాల్లో ఉండేందుకు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు సహకరించాలని కోరారు. కొత్తగా ఏర్పడే కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందించాలని తెలిపారు. కుడా ఛైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.


నాణ్యత డొల్ల..!

- **మంజూరైన నిధుల్లో సగం కూడా ఖర్చు చేయని పరిస్థితి**

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కోట్లాది రూపాయలు వెచ్చించి అభివద్ధి పనులు చేపడుతుంటే అధికారులు చేతివాటం, కాంట్రాక్టర్ (వెండర్స్) నిర్లక్ష్యంతో అభివృద్ధి కుంటుపడుతోంది. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో డ్రెయినేజీలు, సిసి రోడ్ల నిర్మాణంలో డొల్లతనమే కనిపిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలు ఈ రోడ్ల నిర్మాణంపై అసంతృప్తి, నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల అండదండలు, పరపతి కావాల్సినంత ఉందని డాంబికాలు పలుకుతూ కాంట్రాక్టర్ తన ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు.

మండలంలోని బసాపురం, బైచిగేరి, కపటి, పెద్దహరివాణం, సంతేకుడ్లూరు, మండిగిరి, నాగలాపురం, పెసలబండ, పాండవగల్, చాగి తదితర గ్రామాల్లో




సంతేకుడ్లూరులో వేసిన సిసి రోడ్డు

రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేసింది. సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మొదటిలేయర్ సీసీ నిర్మాణం తర్వాత కనీసం వాటర్ క్యూరింగ్ కూడా చేయటం లేదని ఆయా గ్రామ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొదటి లేయర్ సిసి రోడ్లు, పలుచోట్ల డ్రెయినేజీల్లో కంగి విరిగిపోతున్నాయి. పలుచోట్ల ఈ నిర్మాణాలన్నీ ఎగుడుదిగుడుగా అధ్వాన్నంగా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలపై స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పనులు ఒప్పందాలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, నాణ్యత లేని మట్టి, ఇసుకను తోలి ఈ నిర్మాణాలకు ఉపయోగస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులు నాణ్యత చూడాలని కోరుతున్నారు.

అసంపూర్తి ఇళ్లను పూర్తి చేస్తాం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని



పట్టణ శివారులోని ధణాపురం రోడ్డులో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయిస్తామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్‌టిఆర్ కాలనీ పథకం కింద 2,508 గృహాలు లెంటల్, రూఫ్ లెవెల్‌లో నిర్మాణం జరిగాయన్నారు. మిగిలిన పనులు కూడా దగ్గరుండి లబ్ధిదారులు చేయించుకోవాలని తెలిపారు. డిసెంబర్ 31లోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటికే సంబంధిత లబ్ధిదారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఇసుక కొరత లేకుండా కౌతాళం మండలం మరళి రిచ్ నుంచి తీసుకోవచ్చని ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోటాపోటీగా నామినేషన్లు

ప్రజాశక్తి - ఆదోని

కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గం కోసం నామినేషన్ల పర్వం ఆదోనిలో పోటాపోటీగా సాగింది. గురువారం పట్టణంలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ సాగింది. చివరి రోజు కావడంతో డైరెక్టర్ పోస్ట్ కోసం రెండు గ్రూపులుగా విడిపోయి పోటాపోటీగా నామినేషన్లు సమర్పించారు. ఈనెల 19న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా నామినేషన్లు దాఖలకు చివరి రోజు కావడంతో ఐదు డైరెక్టర్ పోస్టులకు 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. సభ్యుల ఓటరు జాబితాలో తప్పులు దొర్లాయని చిన్న గౌడు, లింగన్న గౌడ్ గ్రూపుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా ఆదోని డీఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. నామినేషన్ పత్రాలను తహశీల్దార్ శివరాముడు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, సిఐ సైదుల్, ఎన్నికల అధికారి సజల్ స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని పరిధిలో 35 మంది ఓటర్లు ఉన్నారన్నారు. శుక్రవారం స్క్రూట్నీ, శనివారం విత్ డ్రా, ఈనెల 27న పోలింగ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికైన ఐదుగురు డైరెక్టర్లు ఛైర్మన్‌ను ఎన్నుకుంటారని చెప్పారు. ఓటరు జాబితాలో 35 గాను 42 మంది ఉన్నారని, మిగతా వారిపై కేసులు ఉన్నాయని తొలగించాలని లింగన్న గౌడ్ గ్రూపు వాదించింది. అధికారులు విడుదల చేసిన ఓటరు జాబితాలోని పేర్లు స్పష్టంగా ఉన్నాయని, తమ గ్రూపును దెబ్బ తీసేందుకే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చిన్న గౌడ్ గ్రూపు తిప్పి కొట్టింది.





వేర్వేరుగా నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న సభ్యులు

సిబ్బంది అందుబాటులో ఉండాలి

- సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న

ప్రజాశక్తి - పెద్దకడబూరు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వివిధ గ్రామ సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న కోరారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిందన్నారు. మండలంలో ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. వివిధ గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, డ్రెయినేజీ పూడిక పనులు లేక అపరిశుభ్రంగా తయారయ్యాయని విమర్శించారు. పెద్దకడబూరులోని చాలా చోట్ల మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు పరమేష్, దేవదాసు, ఈరన్న పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



రాష్ట్ర సమగ్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమని గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు చేసి చూపించారని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్రరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు శాసన సభలో తీర్మానం చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాయలసీమ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని చెప్పారు.



నందవరంలో మాచాపురం మాజీ సర్పంచి, టిడిపి మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఖాసీంవలీ మాట్లాడారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ యువ నాయకులు బడేసావలీ, చిన్న రాముడు, ఈసా పాల్గొన్నారు.

'ఆవులను గోశాలకు తరలిస్తాం'

ప్రజాశక్తి - పత్తికొండ

బహిరంగ ప్రదేశాల్లో ఆవులను కనబడితే గోశాలకు తరలిస్తామని పత్తికొండ ఇన్‌ఛార్జీ ఈవో నరసింహులు అన్నారు. గురువారం పత్తికొండ మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రధాన రహదారి మార్గంలో ఆవులు ఎక్కడపడితే అక్కడ ఉంటూ ప్రజలకు ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. ఆవుల తమవని ఎవరు కూడా ఒప్పుకోవడం లేదని మండిపడ్డారు. వాహనాలకు ఆవులు అడ్డం రావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఆవులను మరో రెండు రోజులు చూసి ఆవుల గోశాలకు తరలిస్తామని అన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రజలందరూ సహకరించాలని కోరారు.

23న బీసీ శంఖారావం

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్

ప్రజాశక్తి - ఆదోని

బీసీలందరూ భారీగా తరలివచ్చి బీసీ శంఖారావం మహాసభను జయప్రదం చేయాలని బీసీ సమాఖ్య జిల్లా నాయకులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్ యాదవ్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్నూలు నగరంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న ఆదర్శ విద్య జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 23న మహాసభ ఉంటుందని తెలిపారు. బీసీల్లోని అన్ని కులాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. సభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు హుస్సేనప్ప, బసవరాజు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ యాదవ్

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - హాలహర్వి



బహుమతులు అందజేస్తున్న సిబ్బంది

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన హాలహర్వి జడ్‌పి హైస్కూల్ 8, 9, 10వ తరగతి విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. రవీంద్రనాథ్ రెడ్డి, ఉమాకాంత్ స్వామి, ప్రధానోపాధ్యాయులు హుస్సేనప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు చెస్ పోటీలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యువతరంగ్-2024 క్రీడా పోటీల్లో భాగంగా గురువారం అధ్యాపకులకు చెస్ పోటీలు నిర్వహించారు. పోటీలను వర్సిటీ వీసీ డివిఆర్.సాయి గోపాల్ పాల్గొని ప్రారంభించారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ, గవర్నమెంట్ కళాశాలల తరపున ఐదు బోర్డుల్లో పోటీల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల అధ్యాపకులు మూడు బోర్డులు గెలిచి ప్రథమ స్థానం సొంతం చేసుకున్నారు.

నాలుగేళ్ల తర్వాత..!

- **వ్యాపార భవన సముదాయాలకు వేలాలు**
- **పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా వేలాలు**

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు మేజర్ పంచాయతీలోని సంతమార్కెట్‌లో రూఅర్బన్ పథకం ద్వారా రూ.1.20 కోట్లతో నిర్మించిన 27 వ్యాపార సముదాయ భవనాలకు నాలుగేళ్ల తర్వాత గురువారం వేలాలు నిర్వహించారు. వ్యాపార సముదాయ భవనాలకు గత వైసిపి ప్రభుత్వంలో అప్పటి మంత్రి గుమ్మనూరు జయరామ్ అనుచరులకు, ఆలూరు సర్పంచి (టిడిపి) అరుణదేవి బంధువు బెంగళూరు కిషోర్ అనుచరులకు షాపుల కేటాయింపులో బెడిసి కొట్టింది. రెండు సార్లు వేలాలు వాయిదా పడడంతో పంచాయతీకి రూ.లక్షల ఆదాయం గండి పడింది. రాష్ట్రంలో టిడిపి అధికారం చేపట్టగానే పంచాయతీల అభివృద్ధి కోసం డిఎల్‌పిఒ వీరభద్రప్ప, ఇఒ ప్రభాకర్, సర్పంచి అరుణ దేవి కలిసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు కేటాయించి వేలాలు నిర్వహించారు. ఎస్సీలకు 4, ఎస్టీ 2, బీసీ 8, మిగిలిన షాపులు ఇతరులకు కేటాయించారు. 1 నుంచి 10, 17 నుంచి 21 పెద్ద షాపులకు రూ.30 వేలు డిపాజిట్ కట్టి రూ.3 వేలు సర్కార్ సవాల్ పాటగా నిర్ణయించారు. 11 నుంచి 16, 22 నుంచి 27 వరకు చిన్న షాపులకు రూ.25 వేలు డిపాజిట్, సర్కార్ సవాల్ రూ.2 వేలు పాటపై హెచ్చుగా పాడి దక్కించుకున్నారు. వేలం పాట నిర్వహించడంతో పంచాయతీకి నెలకు రూ.1,20,900గా 12 నెలలకు డిపాజిట్‌తో పాటు మిగిలిన మొత్తం డిసెంబర్ 30లోపు కడితేనే జనవరి 1న షాపులను అందజేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు. 12 నెలలకు గాను ఆలూరు మేజర్ పంచాయతీకి ఈ భవన సముదాయాల నుంచి రూ.14,58,800 వస్తుందన్నారు. పంచాయతీ వేలాలు మళ్లీ వాయిదా పడకుండా అల్లర్లకు తావు లేకుండా పత్తికొండ డీఎస్పీ, ఆలూరు సిఐ వెంకటచలపతి పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు మధ్య వేలం పాటలు ప్రశాంతంగా ముగిశాయి.



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

హైకోర్టు బెంచ్ హర్షనీయం

- రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

ప్రజాశక్తి- దేవనకొండ



ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం తెలపడం హర్షనీయమని రాష్ట్ర వాల్మీకి/బోయ ఫెడరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి జరగాలని చెప్పి ఉత్తరాంధ్రలో రాజధాని పేరుతో మూడు ముక్కలాట ఆడిందని విమర్శించారు. సాధ్యమైనంత త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్ పూర్తవుతుందని తెలిపారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి రాయలసీమకు సాగునీరందించేందుకు కృషి చేస్తుంని చెప్పారు. లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కర్నూలులోనే ఉండేలా చర్యలు తీసుకుని.. ప్రభుత్వం అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

వాలంటీరు వ్యవస్థపై మాట తప్పిన 'కూటమి'

-వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మన్న

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



రాష్ట్రంలో వాలంటీరు వ్యవస్థను కొనసాగిస్తామని, జీతాలు రూ.10 వేలకు పెంచుతామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీఇచ్చి తప్పిందని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కోటేకల్ లక్ష్మన్న విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వ్యవస్థ బాగా నడవడానికి, ప్రజలకు సంక్షేమాలు అందడానికి వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమలు చేతకాక, వాలంటీరు వ్యవస్థను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొనడం అసమంజసమని విమర్శించారు. ప్రజల సంక్షేమం నిమిత్తం వాలంటీరు వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఇసుక సంరక్షణపై పెదవి విరుపులు

- మాది కాదంటే.. మాది కాదంటున్న అధికారులు

ప్రజాశక్తి - మంత్రాలయం

ఇసుక సంరక్షణ బాధ్యత తమది మాత్రమే కాదంటూ భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ, పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. కలిసి వస్తే ఇసుక అక్రమ రవాణా నివారణ సాధ్యమవుతుందని చెబుతున్నారు. సంపద సృష్టితో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించాలని చూస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇసుక అక్రమ రవాణా, బెల్టు షాపుల నిర్వహణ తెలుగు తమ్ముళ్ల నుంచి తలనొప్పిగా మారింది. ఉచిత ఇసుక విధానంతో ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ నేపథ్యంలో అక్రమ రవాణాతో సొమ్ము చేసుకునేందుకు నాయకులు దారులు వెతుక్కుంటూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దోచుకొని దాచుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇసుక అవసరమైన వారు స్థానిక సచివాలయాల్లో నిర్మాణాలకు సంబంధించిన పత్రాలను, ఆధార్ కార్డును చూపించి ట్రాక్టర్ల నెంబర్లతో పాటు కార్యదర్శి వద్ద అనుమతులు తీసుకుని ఉచితంగా పొందవచ్చు. జిఒను పక్కన పెట్టి 'ప్రభుత్వం మాది. మా మాటే నెగ్గాలి' అనే విధంగా అధికారులను ఆధీనంలో ఉంచుకొని నాయకులు అనుచరులతో ఇసుక అక్రమ రవాణా చేయించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల తుంగభద్ర నది నుంచి స్థానికంగా కొందరు అక్రమంగా తరలించి నిల్వ చేసుకున్న విషయంపై మీడియా ద్వారా బహిర్గతమైంది. అటు రెవెన్యూ అధికారులు కానీ ఇటు పోలీసు అధికారులు కానీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మీడియా ప్రతినిధులు ప్రస్తావించినప్పుడు మాత్రమే విఆర్‌ఒను పిలిచి చెప్పడం.. తర్వాత దానిని వదిలివేయటం వల్ల ఇసుక దందా కొనసాగుతూనే ఉంది. ఇదే విషయాన్ని పోలీసు అధికారులను అడిగితే.. తహశీల్దార్ పట్టుకున్న ట్రాక్టర్లను, ఇసుక డంప్‌ను వదిలివేయడం వల్ల తాము మిన్నకున్నట్లు చెబుతున్నారు. తహశీల్దార్ ఆదేశాలు జారీ చేస్తే కచ్చితంగా అమలు చేసి ఒక్క ట్రాక్టర్ కూడా తిరగకుండా చేస్తామని పేర్కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాల్సిన అధికారులే బాధ్యతలను విస్మరించి ఒకరిపైఒకరు చెప్పుకుంటూ దోపిడీకి సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఇసుక (ఫైల్)

ఆధార్ అప్‌డేట్ కేంద్రం ఏర్పాటు చేయాలి

- ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు ఆనంద్

ప్రజాశక్తి - కౌతాళం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కౌతాళంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు ఆనంద్, ఉపాధ్యక్షులు ఉలిగయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎంపిడిఒ సుబ్బరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌతాళం మండలంలో మొత్తం 30 పంచాయతీలు ఉన్నాయని, వీటిలో ఏ ఒక్క పంచాయతీలో కూడా ఆధార్ అప్‌డేట్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలకు, విద్యార్థులకు, కొత్తగా పెళ్లయిన వారికి, వృద్ధులకు ఆధార్ కార్డులో వివరాల సవరణకు ఆదోని ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. పేదలు ఆర్థికంగానూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పేదలను దృష్టిలో ఉంచుకొని కౌతాళంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపిడిఒ మాట్లాడుతూ... త్వరలోనే ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. నాయకులు ఉల్లిగయ్య, శివకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం చెక్కు అందజేత

ప్రజాశక్తి - ఆదోని

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదోని ప్రజల నుంచి సేకరించిన నగదును చెక్కు రూపంలో అమరావతిలో ముఖ్యమంత్రి చంద్ర బాబుకు అందజేశామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, తదితరులు వివిధ రూపాల్లో అందజేసిన రూ.13.86 లక్షల చెక్కును ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇచ్చామన్నారు. ఏ ఆపద వచ్చినా ఆదోని నుంచి తోచిన సహాయాన్ని అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సీనియర్ నాయకులు దేశాయ్ చంద్రన్న, రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు విట్టా రమేష్, నాగరాజు గౌడ్, నాయకులు మరియాని చిన్న బసప్ప పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి బాబుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

వేతనాలు పెంచాలని విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - ఆలూరు

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు 2022 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచాలని విధులను బహిష్కరిస్తున్నట్లు ఆలూరు గిరిజన కురుకుల బాలికల పాఠశాల ఉపాధ్యాయులు మల్లి కార్జున, రాజేంద్ర తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని, విధులను బహిష్కరిస్తూ గురువారం పాఠశాలలోని ప్రిన్సిపల్ ఛైర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు ప్రతాప్, విజయకుమారి, సూర్యప్రకాష్, రంగబాబు, పరమేష్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం స్వర్ణ పల్లకోత్సవ సేవ చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. కొయ్య వెండి గజారోహణం, వెండి, స్వర్ణ, నవరత్న స్వర్ణ రథోత్సవ సేవలు చేయించిన భక్తుల సమక్షంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులును అధిష్టింపజేసి శ్రీమఠం ప్రాకారంలో ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా సిఐ రామాంజులు, శ్రీమఠం సెక్యూరిటీ సిబ్బంది ఆధ్వర్యంలో భద్రత కల్పించారు.



ఊరేగుతున్న ప్రహ్లాద రాయులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పోలింగ్ సరళిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నందవరం

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు శేఖరప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు పోలింగ్ సరళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఉమాదేవి, మద్దయ్య, ఎస్.పరమేష్, రాజు, పార్వతిదేవి మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో భారత రాజ్యాంగం ప్రజలకు కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అని తెలిపారు. ఐదేళ్లకోసారి ఎన్నికల సరళి ఎలా ఉంటుదో మాక్ పోల్ ద్వారా విద్యార్థులకు వివరించారు. ఓటరు జాబితా, అభ్యర్థుల జాబితాతో కూడిన బ్యాలెట్ పేపర్, పోలింగ్ ఆఫీసర్లు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్, బ్యాలెట్ బాక్స్ ఏర్పాటు చేసి మాక్ పోల్ నిర్వహించారు. 4 గంటల తర్వాత కౌంటింగ్ విధానంపై కూడా అవగాహన కల్పించారు. అభ్యర్థులకు వచ్చిన ఓట్లను 25 చొప్పున కట్టలు కట్టించి ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులు గెలిచినట్లు ప్రకటించారు. ఉపాధ్యాయులు ప్రసాద్, బసవరాజు, జె.ఎల్లప్ప, సూర్యనారాయణ, జయన్న, సత్యన్న, మేరీ, విజయలక్ష్మి, లక్ష్మీకళ, ప్రమీలమ్మ, వాణి పరిమళ, మహాలక్ష్మి, హనుమంతరావు, నరసన్న, కేశవయ్య పాల్గొన్నారు.

పాత పని వేళలు కొనసాగించాలి

- డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



మాట్లాడుతున్న డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరెకృష్ణ

రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పాత పనివేళలను కొనసాగించాలని డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరె కృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక డిటిఎఫ్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాశాఖ పని వేళలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ప్రయాణానికి అసౌకర్యంగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో కూడా 7 గంటల పాఠశాలల పని వేళలను కొనసాగించాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్లు గోట్ల చంద్రశేఖర్, చంద్రశేఖర్ యాదవ్, రవీంద్ర, జిల్లా బాధ్యులు వెంకటేశప్ప, రామన్న, మండల బాధ్యులు చిన్న వీరేష్, రంగస్వామి, వెంకటాచలం పాల్గొన్నారు.

పట్టణంలో బైక్ దొంగతనం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ఎంజి పెట్రోల్ బంక్ దగ్గర కురువ నరసింహులు నివాసం ఉంటున్నారు. గురువారం బైక్ (ఎపి 21 బిజె 4703 నెంబర్ గల స్ప్లెండర్ ప్లస్)ను ఇంటి ముందు ఉంచి పని నిమిత్తం వేరే ఊరికి వెళ్లారు. ఊరు నుంచి వచ్చి చూడగా బైక్ దొంగిలించబడినట్లు గుర్తించారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తామని తెలిపారు.